క్లుప్తంగా

గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వరహాల కృష్ణారావు

మెళియాపుట్టి: మండల కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని చెప్పడం హర్షణీయమని, అయితే 5వ షెడ్యూల్‌తో కూడిన ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు అన్నారు. మండలంలోని అచ్చనాపురం గ్రామంలో గిరిజనులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు అత్యధికంగా నివసించే గ్రామాల సముదాయంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందన్నారు. ఐటీడీఏలో ఉండే అన్ని శాఖల్లో గిరిజనులకు ఉద్యోగాలు వచ్చేలా నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మెళియాపుట్టి ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షుడు కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళా కానిస్టేబుల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు విద్యార్థి దశ నుంచే ప్రయత్నం చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నంద సూర్యనారాయణ స్వామి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ మహిళా పోలీసు కానిస్టేబుల్ పి.ప్రియాంకను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని చీకటి దందా





రాత్రివేళలో ఇసుక తరలిస్తున్న దృశ్యం

జలుమూరు: మండలంలో సురవరం పంచాయతీ దొంపాక గ్రామ సమీపంలోని వంశధార నదిలో ఇసుక దందా కొనసాగుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు నాయకుల అండతో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేపడుతున్నారు. ఇటీవల అధికారులు మాట్లాడుతూ.. రాత్రి వేళలో ఇసుక రవాణాకు అనుమతులు లేవని చెప్పినా, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక దందా కొనసాగుతుండడం గమనార్హం.

పరీక్ష కిట్లు అందజేత

మెళియాపుట్టి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పాతపట్నం మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షుడు రాజశేఖరరెడ్డి పరీక్ష కిట్లును శుక్రవారం పంపిణీ చేశారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.



లేఖ.. చేతిరేఖ

ప్రజలకు సకాలంలో ఉత్తరాలు అందజేయడం.. పోస్టులు పార్శిల్ చేయడం వంటి పనుల్లో ఉరుకులు పరుగులతో సాగే జీవితం పోస్టుమెన్‌ది. అలాంటి ఉద్యోగాన్ని తండ్రి మరణానంతరం చేపట్టింది సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన నానుపాత్రుని దమయంతి. తన తండ్రి పోస్టుమెన్‌గా పనిచేసి మరణించడంతో, ఆయన పోస్టులో ఆమెను అధికారులు నియమించారు. అయితే ఆ ఉద్యోగం అత్యంత కష్టతరమైనదని పలువురు భయపెట్టారు. కానీ అధైర్య పడకుండా 2006లో పోస్టల్ డిపార్టుమెంట్‌లో ఈడీడీఏ ఎంసీగా ఆమె తన ప్రస్థానం ప్రారంభించారు. తదుపరి 2013లో డిపార్టుమెంట్ నిర్వహించిన పరీక్షల్లో పోస్టు ఉమెన్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీస్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉత్తరాలు సకాలంలో అందజేయడంలో సమర్థవంతంగా పనిచేయడంతో ఆమె పలు సత్కారాలు పొందింది. అలాగే 2025 సంవత్సరానికి ఉత్తమ పోస్ట్ ఉమెన్‌గా సత్కారం మహిళా దినోత్సవం రోజున అందుకోనుంది. - సరుబుజ్జిలి





హరికథే.. ఆమె కథ

ఏడేళ్ల వయస్సులోనే హరికథలు చెప్పడం ప్రారంభించి, భాగవతారణిగా ఖ్యాతి పొందింది రోణంకి మీనాక్షి. ఆమెది పొందూరు మండలంలోని గోకర్నపల్లి గ్రామం. తండ్రి దగ్గర నుంచి వారసత్వంగా హరికథలు చెప్పడం ప్రారంభించారు. ఆమె హరికథ చెబితే వినేవారు తమని తాము మైమరచి కథలో లీనమైపోతారు. సుమారు 30 ఏళ్లుగా హరికథలు, పందిరి పాటల ప్రక్రియలను కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 1500లకు పైగా హరికథలు, పందిరి పాటల ప్రక్రియల్లో ప్రదర్శనలిచ్చారు. అలాగే తాను ఒక కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. రామాయణం, మహాభారతం, కీచకవధ, శ్రీకృష్ణ రాయబారం, శివలీలలు, సీతారామ కల్యాణం, హనుమత్ సత్యాగ్రహం వంటి వాటిపై హరికథలు చెప్పారు. జానపద కళారూప ప్రక్రియల్లో భాగంగా రామయ్యతండ్రి సంబరాలు, గంగా కల్యాణం, లక్ష్మణమూర్ఛ వంటి వాటిపై పందిర పాటల ప్రక్రియను ప్రదర్శిస్తుంటారు. ఆమె తన ప్రతిభతో ఎన్నో సత్కారాలు అందుకుంది. - పొందూరు



మహిళల భద్రత నిర్లక్ష్యం దిశగా..

- మూలకు చేరిన దిశా సైబర్ కవచ్ యంత్రం
- గత ప్రభుత్వంలో విశేషంగా సేవలందించిన మెషీన్
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో మూలకు చేరిన వైనం
- మహిళలకు తప్పని సైబర్ నేరగాళ్ల వేధింపులు

శ్రీకాకుళం క్రైమ్: మన ఫోన్‌లో డేటా మనకు తప్ప ఎవరికీ తెలియదనే నమ్మకంతో ఉంటాం. అయితే సైబర్ కేటుగాళ్ల కన్నుపడిందా అంతే సంగతులు. ముఖ్యంగా మహిళలకు వేధింపులు తప్పవు. వ్యక్తిగత సమాచారం సేకరించి లింకులు, యాప్‌ల ద్వారా అకౌంట్లలోని సొమ్మును ఖాళీ చేస్తుంటారు.

- వందలాది ఫొటోలను చాలామంది సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు. ప్రొఫైల్ పిక్స్‌కు లాక్ పెట్టుకోరు. మహిళల విషయంలో ఇది అంత మంచి పద్ధతి కాదని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- సైబర్ నేరస్తులు ఐడెంటిటీ థెఫ్ట్ ద్వారా మహిళలు, యువతుల ఫొటోలు, వీడియోలు దొంగిలించి వాటిని మార్ఫింగ్ చేస్తారు. ఇంటర్‌నెట్ / సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేస్తామని బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బును దోచుకోవడం, లైంగికంగా వేధించడం వంటి పనులు చేస్తారు.
- వాట్సాప్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి యాప్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లే కాక ఫ్రెండ్స్ ముసుగులో కొందరు యువతులను, మహిళలను మోసగించాలని చూస్తారు.
- అసభ్య చాట్స్, న్యూడ్ వీడియోకాల్స్‌కు ప్రేరేపించి వాటిని రికార్డు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని, ఫ్యామిలీ / ఫ్రెండ్స్‌కు పంపిస్తామని బ్లాక్ మెయిల్ చేసి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తారు. హనీ ట్రాప్‌లో ఇది ఒక కొత్త తరహా నేరం. ఈ సైబర్ నేరాల్లో స్త్రీలే ఎక్కువగా బాధితులు.



నేడు | ఎస్పీ ఆఫీసులో మూలకు చేరిన సైబర్ కవచ్ మెషీన్



నాడు | దిశ సైబర్ కవచ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రాధిక(ఫైల్)

ఈ చిత్రంలో దుమ్ముపట్టి మూలకు చేరిన యంత్రం ఏమిటో తెలుసా..!

దీని పేరు దిశ సైబర్ కవచ్ ఇది. సైబర్ కేటుగాళ్ల నుంచి రక్షణగా ముఖ్యంగా మహిళల భద్రత కోసం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంత్రం ఇది. దీని ఉపయోగమేమిటో తెలుసా.. మొబైళ్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సైబర్ మానిటర్‌కు కనెక్ట్ చేసి స్కాన్ చేస్తే అందులో ఉన్న వైరస్, సైబర్ మాల్వేర్‌తో పాటు మనకు తెలియకుండా ఇన్‌స్టాల్ అయిన యాప్‌లను కూడా గుర్తించి వాటిని తొలగించేది. దీనికోసం ప్రత్యేకంగా ఓ పోలీసు సహాయకున్ని సైతం నియమించారు. మొబైల్ ఛార్జింగ్ పిన్ నుంచి యూఎస్‌బీ కేబుల్ ద్వారా మెషిన్‌కు అనుసంధానిస్తే మొబైల్‌లో ఉన్న సమాచారాన్ని బట్టి వైరస్‌ను గుర్తిస్తుంది. మొబైల్‌లో తెలియకుండా యాప్‌లు, సాఫ్ట్‌వేర్‌లు గుర్తిస్తుంది. వాటిని వెంటనే డిలీట్ చేసుకోవచ్చు. ఈ మోనిటర్ ద్వారా ఎటువంటి వ్యక్తిగత సమాచారం తస్కరించబడదు. ప్రజలకు ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడే ఈ మిషన్ ఇప్పుడు దుమ్ము ధూళితో తుప్పు పట్టి ఎస్పీ కార్యాలయంలో ఓ మూలకు చేరడం పలువురినీ విస్మయపరుస్తోంది. కూటమి ప్రభుత్వ తీరును పలువురు తప్పుబడుతున్నారు.



జిల్లాలో కొన్ని సైబర్ మోసాలు..

- ఇటీవల జిల్లాకేంద్రంలో ఓ విద్యార్థిని ఫొటోలు, వీడియోలు తస్కరించిన తిరుపతి యువకుడు అశ్లీల వెబ్‌సైట్లలో పెట్టాడు. మరో యువకుడు వాటిని డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాగామ్, వాట్సాప్ తదితర యాప్‌ల్లో పంపి సొమ్ము చేసుకున్నాడు.
- జిల్లాలోని ఓ గ్రూప్–1 మహిళా అధికారిణిని కొన్ని నెలల కిందట ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా న్యూడ్ చిత్రాలు, వీడియోలు రూపొందించి సైబర్ కేటుగాళ్లు మోసం చేద్దామనుకున్నారు. ఆమె అప్రమత్తం కావడంతో తృటిలో తప్పించుకోగలిగింది.
- జిల్లా స్త్రీ శిశు సంక్షేమాధికారి బి.శాంతిశ్రీని సైతం సైబర్ ఉచ్చులో పడి తృటిలో తప్పించుకున్నారు.
- ఎంతో మంది విద్యార్థినులు తమకు ఇన్‌స్టా, వాట్సాప్ యాప్‌ల్లో యువకులు వేధింపులు ఎక్కువయ్యాయని ఎప్పటికప్పుడు సైబర్‌సెల్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు.

● హ్యాపీ ఉమెన్స్ డే

సారవకోట మండలంలోని జేబీటీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వేసిన రంగవల్లిక ఆకట్టుకుంది. మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ ఈ రంగవల్లిక తీర్చిదిద్దారు. - సారవకోట



ప్రజాసేవలో తల్లీకూతుళ్లు

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఆమె కూతురు రెడ్డి వేదితలు ప్రజాసేవకు అంకితమయ్యారు. 2019 నుంచి ఐదేళ్ల పాటు పాతపట్నం ఎమ్మెల్యేగా, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నాయకురాలిగా రెడ్డి శాంతి అనునిత్యం ప్రజలతోనే మమేకమై ఉన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నారు. అలాగే మరోవైపు ఆమె కుమార్తె రెడ్డి వేదిత ఐఏఎస్ అధికారిగా, ఢిల్లీ ప్రభుత్వ విద్యాశాఖ డైరెక్టర్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. వేదిత గతంలో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా, అండమాన్, నార్త్ ఢిల్లీ కలెక్టర్‌గానూ బాధ్యతలు చేపట్టారు. తల్లీకూతుర్లు ఒకరు అత్యున్నత అధికారిగా, మరొకరు రాజకీయ నాయకురాలిగా ప్రజల్లోనే ఉంటున్నారు.



మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఆమె కుమార్తె వేదిత

సమస్యల పరిష్కారానికి చర్యలు

పొందూరు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రజావేదిక ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తూర్పు తీర ప్రాంత వినియోగదారుల గ్రీవెన్స్ రిడ్రెసెల్ ఫోరం చైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం పొందూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని వినతులు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022 నుంచి 2025 వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ద్వారా 1,648 వినతులు స్వీకరించగా, 1,448 పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 219 సమస్యలపై ఫిర్యాదులు అందగా, 90 పరిష్కరించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు షేక్ బాబర్, సులేఖారాణి, ఎస్.మురళీకృష్ణ, ఈఈ పి.యోగీశ్వరరావు, డీఈ రమణమూర్తి, ఏఈ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

చట్టాలపై అవగాహన అవసరం

నరసన్నపేట: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని నరసన్నపేట ఐసీడీఎస్ పీవో నాగమణి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మహిళలకు మేలు చేసేందుకు అనేక చట్టాలు అమలు చేస్తున్నాయని తెలియజేశారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మరింతగా రాణించి మహిళా లోకం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో అదనపు పీవో లావణ్య, ఏపీఎం అప్పలరామయ్య, కళాశాల ప్రిన్సిపాల్ పి.లత, వ్యవసాయాధికారి కె.సునీత, వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవో నాగమణి



మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయ కార్యదర్శులు సకాలంలో విధులకు హాజరవ్వకుంటే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావాలి

నరసన్నపేట: మండలంలోని జమ్ము పంచాయతీ లే అవుట్‌లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావాలని జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజా సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో లే అవుట్ లబ్ధిదారులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చిలోగా నిర్మాణ పనులు పూర్తి చేసేవారికి అదనంగా రూ.50 వేల ప్రోత్సాహకాలు ఇస్తామని, అలాగే మరో రూ.50 వేలు డ్వాక్రా సంఘాల నుంచి రుణంగా అందిస్తామని తెలియజేశారు. ఒకవేళ మార్చిలోగా పనులు చేపట్టకపోతే ప్రభుత్వం తదుపరి చర్యలకు సిద్ధమవుతోందని స్పష్టం చేశారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

నరసన్నపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎం వకులా రత్నమాలతో పాటు మరో నలుగురు ఉపాధ్యాయినులను తోటి ఉపాధ్యాయులు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. మహిళలు సాధిస్తున్న విజయాల గురించి వివరించారు. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

రాత్రులు ఇసుక రవాణా



రహదారి మధ్యలో మొరాయించిన ఇసుక లారీ

ఆమదాలవలస: మండలంలో రాత్రి వేళల్లో సైతం లారీలతో ఇసుక రవాణా చేపడుతున్నారు. పట్టణ శివారులోని పార్వతీశ్వరునిపేట నుంచి సెయింట్ అన్స్ స్కూల్ రోడ్డు మీదుగా గురువారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో ఇసుక తరలిస్తున్న ఒక లారీ రహదారి మధ్యలో మొరాయించింది. దీంతో వెనుక వచ్చే లారీలను దారి మళ్లించారు. అయితే శుక్రవారం ఉదయం లారీని మరమ్మతులు చేసి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ట్రాఫిక్ ఎక్కువైంది. దీంతో వాహనదారులకు సమాధానం చెప్పలేక లారీని డ్రైవర్ విడిచిపెట్టి వెళ్లిపోయినట్లు సమాచారం. దీన్ని ఆమదాలవలస పోలీసులు పరిశీలించి సరుబుజ్జిలి మండలంలోని వంశధార నది పురుషోత్తపురం ఇసుక ర్యాంపు నుంచి ఇసుక తీసుకొస్తున్నట్లు కాగితాలు ఉండడంతో విడిచిపెట్టారు. అయితే అర్ధరాత్రి సమయంలో ర్యాంపు నుంచి ఇసుకను తరలిస్తున్న అంశంపై పోలీసులు, రెవెన్యూ అధికారులు నోరు మెదపకపోవడం ఆశ్చర్యంగా ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

సర్పంచ్‌పై గ్రీన్ అంబాసీడర్ల ఫిర్యాదు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీ పంచాయతీ సర్పంచ్‌పై గ్రీన్ అంబాసీడర్లుగా పనిచేస్తున్న సిరిపురం దండాసి, బమ్మిడి రామారావులు ఎంపీడీవో నీరజ, ఈవోపీఆర్డీ వసంతకుమారిలకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. తాము సుమారు రెండేళ్లు గ్రీన్ అంబాసీడర్లుగా పనిచేయగా, కేవలం ఆరు నెలల జీతాలు మాత్రమే తమ ఖాతాలకు జమ చేసినట్లు ఫిర్యాదులో తెలిపారు. మరో 15 నెలల జీతాలు సర్పంచ్ తన కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15 నెలల జీతాలు చెల్లించాలని కోరడంతో దపదపాలుగా మరో ఆరు నెలల జీతాలు చేతికి ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన తొమ్మిది నెలల జీతాలు అడుగుతున్నా చెల్లించడం లేదని వాపోయారు. గ్రీన్ అంబాసీడర్ల జీతాలను పంచాయతీ అకౌంట్ నుంచి మూడు దపాలుగా రూ.2,88,000లు విత్ డ్రా చేసినట్లు ఆర్టీఐ యాక్ట్ ద్వారా పంచాయతీ కార్యదర్శి రాత పూర్వకంగా వివరణ ఇచ్చినట్లు చెప్పారు. పంచాయతీ నిధుల నుంచి విత్ డ్రా చేసినప్పటికీ జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఫిర్యాదు మేరకు విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎంపీడీవో నీరజ ఈవోపీఆర్డీకి ఆదేశించారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని సర్పంచ్ దేవుదల సుందరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి ఎద్దడి దృష్ట్యా అదనంగా 3 బోరుబావులు తవ్వుతున్నట్లు చెప్పారు. అందుకే సరఫరాను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిరమండలం: టైలరింగ్‌లో శిక్షణకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో కాశీప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరాల వయసు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులకు గాలికుంటు టీకాలు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి 1వ వార్డులోని జగ్గశాస్త్రులపేట, బైరిశాస్త్రులపేట గ్రామాల్లో పశువులకు ఉచిత గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు శుక్రవారం వేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.రామమోహన్ మాట్లాడుతూ.. టీకాల ప్రాముఖ్యత గురించి పాడి రైతులకు వివరించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

హిరమండలం: ఈనెల 10వ తేదీ నాటికి పాఠశాలల్లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఎంఈవో కె.రాంబాబు సూచించారు. శుక్రవారం అన్ని పాఠశాలల హెచ్ఎంలతో గూగుల్ మీట్ నిర్వహించారు. సీబీఏ టెస్ట్, టీచర్స్ సర్వే, ఆన్‌లైన్ సర్వే వంటి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు.



